ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 24 మే 2025





అంజన్నను దర్శించుకొని బయటకు వస్తున్న భక్తులు

- ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు
- నేటి నుంచి ఆర్జితసేవలు పునరుద్ధరణ

7

డే కేర్ సెంటర్లపై వృద్ధుల ఆశలు

- రాష్ట్రంలో 37 సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- ఒక్కో సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు
- నెలకు రూ.90 వేల బడ్జెట్ కేటాయింపు

6

విచ్చలవిడిగా కల్తీ

- నిబంధనలు పాటించని వ్యాపారులు
- ఆహార నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు
- జిల్లాను వెంటాడుతున్న కల్తీకాటు
- పట్టణ రెస్టారెంట్లు, బేకరీల్లో డొల్లతనం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటాలు
- నామమాత్రంగా తనిఖీలు


తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రజలు ఎక్కువశాతం చిరుతిండ్లకు అలవాటు పడ్డారు. ఇదేఅక్రమ వ్యాపారులకు కాసులవర్షం కురిపిస్తోంది. నాణ్యతలేని, కల్తీ పదార్థాలను వినియోగిస్తున్నారు. జిల్లాలో రోజురోజుకు కల్తీ పదార్థాల తయారీ ఇష్టారాజ్యంగా సాగుతుందన్న విమర్శలు అధికమవుతున్నాయి.

● గాలిలో కలుస్తున్న ఆహార భద్రత...

ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే విధంగా పలు ప్రాంతాల్లో ఆహార కల్తీ యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలోని పలు హోటళ్లతో పాటు బేకరీలు, రెస్టారెంట్లు, బార్లు, ఐస్ పార్లర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, మెస్‌లు, వసతి గృహాలు ఇలా అన్నింటా ఇదే దుస్థితి నెలకొంటుంది. కొన్ని రోజులుగా అధికారుల తనిఖీల్లో కల్తీ, శుభ్రత, నాణ్యతలేనితనం బట్టబయలు అవుతున్నాయి. భారీ జరిమానాలు, మూసివేతలు, తగిన శిక్షలు పకడ్బందీగా అమలు కాకపోవడం ఇందుకు ఓ కారణంగా తెలుస్తోంది. జిల్లాలోని పలు హోటళ్లలో లభించే ఆహార పదార్థాల్లో కల్తీకేదీ కాదు అనర్హం అన్న చందంగా మారింది.

● నిర్వాహకుల ఇష్టారాజ్యం...

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న హోటళ్ల, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులది ఇష్టారాజ్యంగా మారింది. వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే తనిఖీల్లో దొరికినప్పుడు సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఐదు లక్షల రూపాయల జరిమానా విధించే అవకాశాలున్నాయి. ఆహారపదార్థాల్లో ప్రకృతి సిద్ధమైన రంగులే వాడాలి. ఆహార పదార్థాల్లో టేస్టింగ్ సాల్ట్ వాడకూడదు. రోజువారీ వాడే ఉప్పునే వాడాలి. కానీ ఈ నిబంధనలను బిర్యానీ సెంటర్ల వారు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

● ప్రజల ఆరోగ్యంతో చెలగాటం..

నిబంధనల ప్రకారం అన్ని రకాల హోటళ్లలో లోపలిభాగం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. డ్రైనేజీ వసతి బాగుండాలి. వంట వండే వ్యక్తి వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి చాలా చోట్ల అమలు కావడం లేదు. పెద్ద హోటళ్లు, కొన్ని రెస్టారెంట్లు మినహా మిగితా వాటిల్లో పరిశుభ్రత పాటించడం లేదు. భోజనం, టిఫిన్ల తయారీకి నాసిరకం సరకులు, కూరగాయలు వాడుతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. మాంసం సైతం ఇదే విధంగా ఫ్రిజ్‌లో ఉంచి వండుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయం మున్సిపల్ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పలుమార్లు నిర్వహించిన దాడుల్లో బహిర్గతమైంది. అధికశాతం రోడ్డుసైడ్ వ్యాపారాలు మురుగు కాలువలు, చెత్త కుప్పల పక్కన నిర్వహిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు.

● రెండు వేలకుపైగా హోటళ్లు, దుకాణాలు

జిల్లాలో చిన్నా పెద్దహోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్‌లు, నూడుల్స్ షాపులు అన్ని కలుపుకుని రెండు వేలకు పైగా ఉన్నాయి. ఒక్క జగిత్యాల పట్టణంలోని చిన్నా పెద్ద కలుపుకొని సుమారు 150 దాకా ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ సంవత్సరం కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. ఈవ్యాపార సంస్థల ద్వారా అధికారులు ఏడాదికి పది శాంపిల్స్ సేకరించాలి. అయితే నెలలో కేవలం 30 నుంచి 40 శాంపిల్స్‌తీసి చేతులు దులుపుకుంటున్నారు. ఒకవేళ తీసినప్పటికీ ల్యాబ్‌కు వెళ్లేలోగా ఆహారం కుళ్లిపోతుంది. ఫలితంగా ల్యాబోరేటరి పరీక్షల్లో కల్తీ గురించి సరైన నివేదికలు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న చిన్న మధ్య తరగతి హోటళ్లలో 20శాతానికి మించి అనుమతులు లేవన్నది బహిరంగ రహస్యంగా మారింది. కాగా ప్రతీ నెల ఫుడ్ సేఫ్టీ ..

మిగతా 8లో

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి

రాయికల్, మే23 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని పొలాస శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని రామాజీపేటలో శుక్రవారం ఏఈవో పద్మావతి ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం, ఎరువుల వాడకం, భూసార పరీక్షలు, చీడపీడల నివారణ, నీటి వినియోగంపై రైతుల సందేహాలను సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ సైదా నాయక్, శాస్త్రవేత్తలు డాక్టర్ శేషు, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై అవగాహన కలిగి ఉండాలి

మల్యాల, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతనధర్మంపై అవగాహన కలిగి ఉండాలని ఆధ్యాత్మికవేత్తలు విశోక తీర్థ స్వామి, భైలూరు యోగేశ్‌ప్రభుజీ, సద్గురు మహదేవ్, వీరదర్మజ స్వామి, అమోఘ్ దేశపతిజీ, మువ్వ సుభారాజేశ్వరీ అన్నారు. కొండగట్టులో విశ్వహిందూ ధర్మపరిరక్షణ సమితి తెలంగాణశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటా రామాయణం, భగవద్గీత ఉండాలని, చిన్నారులకు హిందూధర్మం గురించి తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో శాలిని రమేశ్, పద్మ జగదీశ్, బొమ్మెన పరమేశ్, పవన్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే ఆరబోయాలి

కలెక్టర్ సత్యప్రసాద్


నేరెళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ధర్మపురి, మే, 23 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యం కుప్పలను వెంటనే ఆరబోయాలని, తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ధర్మపురి మండలంలోని నేరెళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని తేమ వచ్చిన వెంటనే కొనుగోలుచేసి రైస్‌మిల్లుకు తరలించాలని సూచించారు. ధాన్యం సంచులు నానితే వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు రైస్‌మిల్లులకు పంపించాలని, రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడ లేకుండా చూడాలని ఆయన అన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రవాణా అంశంలో వాహనాల కొరత, హమాలీల సమస్య రాకుండ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సెంటర్ ఇన్‌చార్జి అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీవో మనోజ్‌కుమార్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం జితేంద్రప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్, పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, ఆర్‌ఐ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రాయికల్ మున్సిపల్ కమిషనర్

రాయికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా 'ఉమెన్ ఫర్ ట్రీస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు కట్టలపై, చెరువు కింద విరివిగా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యత మహిళా సంఘాల సభ్యులు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో మొక్కలను నాటి పచ్చదనంతో విరజిల్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మెప్మా ఆర్పీలకు మొక్కలు నాటే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ సునీత, సీవో శరణ్య, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా చెరువు కట్టలపై, చెరువు కింద విరివిగా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యత, మహిళా సంఘాల సభ్యులు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో మొక్కలను వాటి పచ్చదనంతో విరజిల్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరం తీసుకుందామన్నారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్‌వో బిర్జా అజ్మతుల్లా బేక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఆర్‌ఐ అక్షయ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణువర్ధన్ రెడ్డి, టీఎంసీ సోమిడి శివ, ముజీబ్, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.


తిప్పన్నపేటలో నీట మునిగిన ధాన్యం కుప్పలు

జగిత్యాలరూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లోకి భారీగా వర్షం నీరు చేరి ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. జగిత్యాల మండలం తిప్పన్నపేట-గోపాల్‌రావుపేట గ్రామాల్లో గురువారం కురిసిన వర్షానికి ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం నీట మునిగింది. దీంతో రైతులు వేరే ప్రాంతానికి తరలించడానికి ప్రయత్నం చేశారు. కొనుగోళ్లలో జాప్యం తోనే వరి పంట నీట మునిగిందని రైతులు ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


తిప్పన్నపేట ఐకేపీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్/జగిత్యాలరూరల్/సారంగాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల మండలం చల్‌గల్ వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు తిప్పన్నపేట, సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామాల్లో అకాలవర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులు అధైర్యపడొద్దని తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకునేందుకునేందుకు అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల కొరతతో కొనుగోళ్లు కొంత ఆలస్యం అవుతుందన్నారు, అకాల వర్షాల వల్ల కొంత నష్టం జరిగిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ అపలేరని, కానీ అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చల్‌గల్ కేంద్రంలో 1,444 క్వింటాళ్ల సన్నవడ్లను కొనుగోలు చేశామని తెలిపారు. కార్యక్ర మంలో జగిత్యాల, కోనాపూర్ సహకార సంఘం ఛైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ దామోదర్‌రావు, నాయకులు మల్లారెడ్డి, నక్కల రవీందర్‌రెడ్డి, పెండెం రాములు, బాల ముకుందం, కోల శ్రీనివాస్, భోనగిరి నారాయణ, శేఖర్ గౌడ్, సంఘ సీఈవో గాజెంగి వేణుతో పాటు రైతులు పాల్గొన్నారు.


రాయికల్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

రైతులు అధైర్యపడవద్దు

- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల రూరల్/రాయికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులెవరూ అధైర్యపడవద్దని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట-గోపాల్‌రావుపేట, రాయికల్ మండలంలోని మూటపెల్లి, భూపతిపూర్ గ్రామాల్లోని ధాన్యంకొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తూకంవేసిన ధాన్యం నిల్వ ఉండటంతో అధికారులతో మాట్లాడి ధాన్యం లోడ్ చేయాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చిందని, ఇప్పటికే సంబంధిత జిల్లా కలెక్టర్‌కు, అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా సమస్యను పరిష్కరించడానికి చూస్తానని తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు లైశెట్టివిజయ్, భారతపు గంగన్న, బండారి మధు, రైతులున్నారు.

అకాల వర్షాలతో అన్నదాత అవస్థలు

- టార్పాలిన్లు అందించని ఏఎంసీ
- తడిసిన సంచుల నుంచి మొలకలు


మెట్‌పల్లిలోని ఏఎంసీలో వర్షపునీటిలో ధాన్యం, ఇన్‌సెట్‌లో మొలకెత్తిన ధాన్యం బస్తాలు

మెట్‌పల్లి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి నెలన్నర గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదు. దీంతో కళ్లలో ఒత్తులు వేసుకుని రైతులు రాత్రింబవళ్లు ధాన్యం రాశుల వద్దే నిరీక్షిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుంచి రైతులు భారీగా ధాన్యాన్ని తీసుకువచ్చారు. కొనుగోళ్లు పూర్తికాకపోవడంతో అకాల వర్షాలకు రైతులు తీవ్ర నష్టాన్ని అనుభవించాల్సి వస్తోంది. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుతో పాటు మండలంలోని వెల్లుల్ల, జగ్గసాగర్, కోండ్రికర్ల గ్రామాల్లో మెట్లచిట్టాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు భారీగా ధాన్యాన్ని తీసుకువచ్చారు. తూకం వేసిన సంచులు తరలించడంతో జాప్యం కావడంతో పాటు, ధాన్యం రాశులు అకాల వర్షాలతో తడిసి ముద్దయ్యాయి. వాతావరణం తేమగా ఉండడతో ఏంచేయాలో అర్థంకాక రైతులు తల పట్టుకుంటు న్నారు. తడిసిన ధాన్యాన్ని ఇప్పటికే రైతులు రెండు, మూడు పర్యాయాలు తిరగబోశారు. గురువారం రాత్రి నుంచి వర్షం కురవడంతో తిరిగి ధాన్యం తడిసింది.

● తడిసిన సంచుల నుంచి మొలకలు...

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో పోసిన ధాన్యం కుప్పలపై వర్షం వచ్చినప్పుడు కప్పుకోవడానికి కనీసం టార్పాలిన్లు అందించలేదు. దీంతో కొందరు రైతులు ఇంటి నుంచి, మరికొద్దరు అద్దెకు తీసుకొని ధాన్యంపై కప్పుతున్నారు. మండలంలోని జగ్గసాగర్, కోండ్రికర్ల, మెట్‌పల్లి ఏఎంసీలో తూకంవేసి మూడు, నాలుగు రోజులవు తున్న సంచులను మిల్లలకు తరలించడంలో నిర్వా హకులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో కురిసిన అకాల వర్షానికి సంచులు పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయి. ధాన్యం కళ్లాల్లో పోసి నెల రోజులు అవుతోంది. ధాన్యం రాశులపై కవర్లు కప్పినా కింద నుంచి నీళ్ల వెళ్లడంతో సంచులకు, ధాన్యానికి పదును వచ్చి మొలకలు వస్తోంది. తేమ రావడం లేదని మిల్లర్లు సంచికి నాలుగు కిలోలు కొత విదిస్తామని తెలపారు. దీంతో చేసేది లేక తూకం వేసిన సంచులను ఆరబోస్తున్నారు. ఆరబోసిన వాటిని మళ్లీ తూకం వేయడానికి కూలీలకు రెండింతల ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్వహకులు కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు కోరుతునానరు.

టార్పాలిన్లు అందించక తిప్పలు..

● ఆకుల గణేష్, రైతు



మార్కెట్ యార్డులో త్వర గా కొంటారని పంటను తీసుకువచ్చాను. తేమ వచ్చి నా కొనలేదు. వర్షం పడిన ప్పుడు కనీసం టార్పాలిన్లు ఇవ్వలేదు. అందుకే వడ్లు పూర్తిగా వర్షపు నీళ్లల్లో మునిగాయి. తేమ రాకుంటే కటింగ్ పెడతారని మళ్లీ ఆరబోస్తున్నాము. అధికారులు కనుకరించి తొందరగా వడ్లను కొనాలి.

తడిసిన ధాన్యం కొనాలని రైతుల ఆందోళన


ధర్మపురి జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న గోపాల్‌రావుపేట రైతులు

జగిత్యాలరూరల్/రాయికల్ మే23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిచిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు రోడ్డెక్కారు. జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట రైతులు ధర్మపురి జాతీయ రహదారిపై, రాయికల్ మండలంలోని సింగరావుపేటలో అకాలవర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల-రాయికల్ ప్రధానరహదారిపై శుక్రవారం బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు సెంటర్లలో నెల రోజులైన అధికారులు ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేయడంతోనే వర్షాలకు ధాన్యం తడిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, తహసీల్దార్ రాంమోహన్, రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ గణేష్ కొనుగోళ్ల త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. రాయికల్ మండలం సింగరావుపేటలో రైతులకు జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ మద్దతు తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి బలవన్మరణం


వెంకవ్వ (ఫైల్)

గన్నేరువరం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన న్యాలపట్ల వెంకవ్వ(80) అనారోగ్యం బారినపడి మనస్థాపంతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వెంకవ్వ కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోయింది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా భర్త గతంలోనే మృతిచెందాడు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరపల్లిలో గుంపుల కొమురమ్మ (75) అనే వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. శుక్రవారం ఉదయం నుంచి వృద్ధురాలు కనబడకపోవడంతో గోపరపల్లి సమీపంలోని బావుల్లో వెతకగా మృతదేహం బయటపడింది. కొన్నేళ్ళుగా వృద్ధురాలు పక్షవాతంతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఒడ్డెర కాలనీకి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోదాసు శంకర్(37) అనేవ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పు రాడ్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో రైతు చేగంటి పోచయ్య(58) అప్పుల బాధ భరించలేక తన వ్యవసాయ పొలం వద్ద ఉరేసుకొని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య తన రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇద్దరు కుమారుల్లో పెద్ద కొడుకు కొమురయ్య పెళ్లి చేసుకొని అత్తగారింటి దగ్గర నివసిస్తున్నాడు. చిన్న కొడుకు రాకేష్ ఆర్థిక ఇబ్బందులతో గల్ఫ్ బాట పట్టాడు. కొడుకును విదేశాలకు పంపేందుకు, పంట పెట్టుబడి కోసం సుమారు రూ.6లక్షల వరకు అప్పులయ్యాయి. వేసిన పంటకు సరిగా దిగుబడి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మనస్తాపం చెంది పంట చేను వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ దుకాణాల సముదాయం వద్ద బుధవారం వర్షానికి తడిసి అచేతన స్థితిలో పడివున్న గుర్తు తెలియని వ్యక్తిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల ఉంటుందని, తెల్లని గీత బ్లూ కలర్ రౌండ్ టీషర్ట్, బ్లాక్ కలర్ పాయింట్, ఎడమ చెవికి పోగు, బెల్ట్ ధరించి ఉన్నట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు సెల్ నంబర్లు 8712656506, 8712656507 సంప్రదించగలరని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దపల్లి మండలంలోని నిట్టూరులో చోటు చేసుకుంది. నిట్టూరు గ్రామానికి చెందిన ముక్కెర సాయికుమార్ (24) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. కొన్నిరోజులుగా పనికి వెళ్ళకుండా ఖాళీగా ఉండడంతో పనికి వెళ్లమని తల్లి మందలించగా ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి కరీంనగర్ వెళ్ళాలని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి ముక్కెర వసంత ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్మన్ రావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న మినీ బస్సు

● చికిత్స పొందుతూ యువకుడు మృతి

తిమ్మాపూర్/మానకొండూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని శంషాబాద్‌కు చెందిన బాకారపు సురేష్(30) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మానకొండూర్ సీఐ సంజీవ్ కథనం ప్రకారం.. శంషాబాద్ గ్రామానికి చెందిన సురేష్, మాజీసర్పంచ్ డొల్ల రమేష్ కలిసి ద్విచక్రవాహనంపై శంషాబాద్ స్టేజీ వద్ద రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన మిని బస్సు వారిని ఢీ కొంది. ఈప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సురేష్ తలకు బలమైనా గాయాలు కావడంతో కరీంనగర్ అసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డే కేర్ సెంటర్లపై వృద్ధుల ఆశలు



● వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ యోచన
● రాష్ట్రంలో 37 సెంటర్ల ఏర్పాటుకు కసరత్తు
● ఒక్కో సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు
● నెలకు రూ.90 వేల బడ్జెట్ కేటాయింపు

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటున్న వారి కోసం ఆ భావనను పోగొట్టడానికి ప్రభుత్వం ప్రతీ జిల్లాలో డే కేర్ సెం టర్లను ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారిత శాఖ ద్వారా రాష్ట్రంలో 37 మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైల్ పై సంతకం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం కోసం పంపినట్లు తెలుస్తోంది. సీఎం గ్రీన్‌సిగ్నల్‌తో రాష్ట్రంలోని జిల్లాల్లో ఒక్కోటి చొప్పున డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

ప్రతీ నెల రూ.4.61 కోట్ల ఖర్చు

కుటుంబ సభ్యులంతా ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఒంటరితనంతో బాధపడుతున్న వృద్ధుల సౌకర్యార్థం ఈ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, హన్మకొండ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగతా 29 జిల్లాల్లో ఒకటి చొప్పున మొత్తం 37 సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన నిబంధనల మేరకు ఏర్పాటు చేయనున్న డే కేర్ సెంటర్ల నిర్వహణను వయోవృద్ధుల సంక్షేమ శాఖకు అప్పగించనున్నారు. వీటి నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల 4.61 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నారు. ఒక్కో సెంటర్ నిర్వహణకు నెలకు రూ.90 వేలు బడ్జెట్ కేటాయించనున్నారు.

సకల సదుపాయాలు

ఒక్కో డే కేర్ సెంటర్‌లో 50 మందికి సదుపాయాలు ఉంటాయి. ఇందులో కిచెన్, వైద్యుల గది, విశాలమైన హాల్, క్యారమ్స్, టెన్నిస్, చెస్ వంటి ఆట వస్తువులతో పాటు లైబ్రరీ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. డే కేర్ సెంటర్‌లో ఇండోర్ గేమ్స్, యోగా, పుస్తకాలు, కథలు, ధ్యానం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ వారం వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను కూడా ఉచితంగా ఇస్తారు. డే కేర్ సెంటర్లకు వచ్చే వృద్ధులకు రాగి జావ, పండ్ల రసాలు, ఉప్మా, టీ, బిస్కెట్లు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..
బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జగిత్యాల



వృద్ధుల సంక్షేమానికి డే కేర్ సెంటర్ల ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ నిర్ణయం మేరకు జరుగుతోంది. ప్రస్తుతం ఇందుకు అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. ప్రభుత్వ పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం.

పోలీసుల అదుపులో మావోయిస్టు సానుభూతిపరుడు?

జగిత్యాలరూరల్, మే 23 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాలరూరల్ మండలం పొలాస శివారులో మూడురోజుల క్రితం మావోయిస్టు సానుభూతిపరుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని నుంచి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకు న్నారని విశ్వసనీయ సమాచారం. జగిత్యాల మండలం ధరూర్‌లో 40ఏళ్లుగా నివాసం ఉంటున్న వ్యక్తి బండ రాళ్లకు డ్రిల్లింగ్‌వేసి జిలెటిన్‌స్టిక్స్‌తో ఉపాధి పొందున్నట్లు, ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనుమానితుడికి మావోయిస్టులపై ఉన్న సంబంధాలపై పోలీసు అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్‌ను వివరణ కోరగా ఇది పూర్తిగా అవాస్తవమని ఖండించారు.

దొంగ అరెస్ట్


దొంగను అరెస్ట్ చూపిస్తున్న సీఐ కె కృష్ణ

సిరిసిల్ల క్రైం, మే 23(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన వేల్పుల రాజేశ్వర్‌రెడ్డి(31) అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్లటౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. నిందితుడివద్ద 48.47గ్రాముల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. బోయిన్‌పల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి తనభార్యతో కలిసి సిద్దిపేటలో ఉన్న తన బంధువుల పెళ్లికి వెళ్తుండగా సిరిసిల్ల బస్టాండ్‌లో తన భార్య హాండ్‌బ్యాగులో నుంచి బంగారు నల్లపూసలతాడు, ఒక జత చెవికమ్మలు, వంక ఉంగరం, చైన్ దొంగిలించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈమేరకు బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజార్‌లో అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. దొంగిలించిన అభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బంగారంతో వెళ్లేటపుడు రద్దీ ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలని, మహిళలు బంగారు అభరణాలతో ప్రయాణం చేసేటపుడు తోడుగా ఎవరినైనా తీసుకెళ్లాలన్నారు. రద్దీ ప్రదేశాల్లో, బస్టాండ్‌లలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తి కనిపిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును బ్యాంక్ లాకర్‌లలో భద్రపరుచుకోవడం క్షేమం ఆయన తెలిపారు.

హత్యాయత్నంపై ముందుకు సాగని విచారణ

● కమిషనరేట్‌కే సవాల్‌గా మారిన కేసు

కోల్‌సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన పరంకుశం యశ్వంత్(36)పై జరిగిన హత్యాయత్నం కేసు విచారణ ముందుకు సాగడం లేదు. నాలుగు నెలలు గడిచినా కేసులో పురోగతి లేదు. రామాలయం సమీపంలోని సింగరేణి క్వార్టర్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ సోర్సింగ్ కార్మికుడు, ఫిజిషియన్ అసిస్టెంట్ అయిన యశ్వంత్‌పై జనవరి 7న హత్యాయత్నం జరిగింది. ఇంటివెనుక నుంచి ఇంట్లోకి చొరబడిన నిందితులు కత్తులతో అతడి తల, ముఖంపై దాడిచేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. అతడి భార్య ప్రతిమ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. యశ్వంత్ ఫోన్‌లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతుండగా పోలీసులకు సమాచారంఇచ్చి ఆసుపత్రిలో చేర్పించారు. ఇంట్లో సీసీకెమెరాల పుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి కదలికలను గుర్తించారు. అతడి గురించి ఎంత ప్రయత్నించినా వివరాలు దొరకలేదని సమాచారం. సమీప కాలనీల్లోని సీసీపుటేజీలను పరిశీలించినా ఆధారాలు దొరకలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వారు వేలిముద్రలు లేకుండా జాగ్రత్తపడ్డారు. ఘటన జరిగిన సమయంలో నగదు, ఆభరణాలు ఉన్నా వాటిని ముట్టుకోలేదు. దీంతో ఉద్దేశ్యపూర్వకంగా దాడికి వచ్చిన వారుగాపోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కాల్‌డాటాను, ఇతర ఆధారాలను విశ్లేషించారు. కుటుంబసభ్యులు, బంధువులు, ఇతర అనుమానితుల సమాచారాన్ని సేకరించి విచారణ జరిపారు. ఎక్కడా కూడా ఆధారాలు లేక కేసు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం యశ్వంత్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడు కోలుకున్నా మాట్లాడడం, మనుషులను గుర్తు పట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈకేసు రామగుండం కమిషనరేట్‌కే సవాల్‌గా మారింది.

● అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం
- గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్

యశ్వంత్ హత్యాయత్నం కేసుపై అన్నీ కోణాల్లో విచారణ జరుపుతున్నాం. టెక్నాలజీని కూడా వాడుతున్నాం. పలువురు అనుమానితులను విచారించాం. ఫోన్ల డాటాను కూడా రిట్రీట్ చేస్తున్నాం. త్వరలోనే ఛేదించేలా కృషి చేస్తున్నాం.

గ్రామస్థులు ఒక్కటయ్యారు.. కబ్జా భూమిని కాపాడారు


ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసిన బోరును చూపుతున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

మెట్‌పల్లి రూరల్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ఇటీవల ఆక్రమించి చదును చేసిన విషయాన్ని పలుమార్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అధికారులు సర్వే చేపట్టారు. గ్రామంలో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అందులో రెండు ఎకరాలలో మామిడి, నాలుగు ఎకరాల్లో బోర్లు ఏర్పాటు చేసుకోని వరి సాగుచేస్తున్నట్లు గుర్తించారు. అధికారులు ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అధికారులు హద్దులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమించిన, చదును చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళను బెదిరించి డబ్బులు దోపిడీ

కరీంనగర్ అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన మాంకాళి మీనను శుక్రవారం ఉదయం బద్దిపెల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తి చంపుతానని బెదిరించి ఆమెవద్ద ఉన్న 4వేల రూపాయల నగదును దోచుకున్నాడని కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మీనా కమాన్‌పూర్ నుంచి కొండాపూర్‌లో శుభకార్యానికి వెళ్తోందని, బద్దిపల్లి శివారులో దోపిడీకి గురైందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ నాలుగు, ఆరోసెమిస్టర్ పరీ క్షల్లో శుక్రవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన ఏడుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. కిమ్స్ డిగ్రీకళాశాల కరీంనగర్ ఒకరు, ప్రభుత్వ డిగ్రీకళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ఆపూర్వ డిగ్రీకళాశాల కరీంనగర్‌లో ఇద్దరు, చాణిక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఒకరు, వాగ్దేవి, డిగ్రీ కళాశాల హుజూరబాద్ కేంద్రంలో ఒకరు చొప్పున ఉన్నారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం


మమత(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కుచెందిన చెల్లోజు మమత(36) అదృశ్యమైనట్లు కేసునమోదు చేశామని త్రీటౌన్‌పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మమత ఆచూకీ లేకుండా పోయిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీతెలిసినవారు కరీంనగర్ త్రీటౌన్‌పోలీసులకు ఫోన్‌నంబర్ల 9392373873, 9491475061, 8712670763కు తెలపాలని సూచించారు.

బెట్టింగ్ పేరుతో మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో పెద్దహనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాది భక్తులు తరలిరావడంతో శుక్రవారం బెట్టింగ్ ముఠా సభ్యులు నిలువు దోపిడీకి గురిచేశారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌అంటూ పెట్టిన పెటుబడికి రెట్టింపుఅంటూ దోపిడీకి పాల్పడిన ముఠాను కొందరు భక్తులు గుట్టురట్టు చేశారు. దిగువ కొండగట్టులో ముఠాగా ఏర్పడి కొందరు ఆన్‌లైన్‌లో పదినుంచి ఇరవైవేలవరకు యూపీఏ పేమెంట్స్ ద్వారా తీసుకున్నారు. అయితే ముఠాలోని సభ్యులే ఇతరులను ఆకర్శించేందుకు వారు కూడా పేమెంట్స్ చేయడంతో అది తెలియనికొందరు చెల్లించారు. అనుమానం వచ్చిన ఓ భక్తుడు ముఠా నాయకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో భక్తుని వద్ద వసూలు చేసిన ఇరవై వేల రూపాయలు తిరిగిఇచ్చి ముఠా సభ్యులు అక్కడి నుంచి జారుకున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీఎస్ఐ పిట్ల దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గడ్డివానిపల్లె గ్రామానికి చెందిన ఎల్లవేని అయిలయ్య-సమ్మక్కకు ఇద్దరు కుమారులు హరీష్, జయపాల్ ఉన్నారు. వీరి ఇద్దరి మధ్య దారి విషయంలో కొంతకాలంగా గొడవ జరుగుతోంది. గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ చేసుకున్నప్పటికీ ఒప్పందం కుదరలేదు. దీంతో గురువారం సాయంత్రం జయపాల్, అతడి మామ గడ్డి కొంరయ్య ఇంట్లో ఉన్న గొడ్డలితో హరీష్‌పై దాడికి యత్నించారు. హరీష్ భార్య అనూష అడ్డుకోబోగ ఆమెకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే ఆమెను జమ్మికుంటలోని ఆస్పత్రికి ప్రథమచికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయపాల్, కొంరయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు న్యాయం చేయాలి

● సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి న్యాయంచేయాలని సహచర ఎమ్మెల్యేలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గం ఏకపక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపడంతో విజయానికి ఎంతో తోడ్పడ్డారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ సామాజికవర్గంలో మూడొంతులు మాదిగలు ఉండగా కీలక పదవుల్లో మాదిగలకు చాలా తక్కువ ప్రాతినిథ్యం ఉందని తెలిపారు. కేబినెట్లో కేవలం ఒకమాదిగ ఉపవర్గానికి మాత్రమే మంత్రి పదవి ఇచ్చారన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి ఒక అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శ్యామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రశ్నించే వారికి బీజేపీ వేధింపులు..

పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈడీ ఛార్జ్ షీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు ఉందని బీఆర్ఎస్, బీజేపీ తెగ హడావుడి చేస్తుందని ఆయన విమర్శించారు. విపక్ష పార్టీలపైన కేంద్రం ఈడీని ప్రయోగిస్తుందని, ప్రశ్నించే వారిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధిస్తుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి దేశంలోనే గొప్ప పేరు వస్తుందనే భయంతో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రమాదం జరిగితే పట్టుకునేది ఎలా?

● ప్రమాదం జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు ● పోలీసుల దర్యాప్తుకు ఇబ్బందిగా మారుతున్న వైనం


తుమ్మన్నపల్లి గ్రామంలో చెట్టును ఢీకొన్న లారీ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదాలు జరిగిన సమయంలో తప్పు ఎవరిది అన్నది తెలియకపోవడంతో పోలీసుల దర్యాప్తునకు ఇబ్బందిగా మారుతోంది. మండలంలో ఆయాగ్రామాల్లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, అలాంటి ప్రాంతాల్లో ప్రమాదం సంభవించే ప్రాంతాలుగా అధికారులు గుర్తించి వాటివద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు లేకపోవడంతోనిందితులను పట్టుకోవడం అధికారులకు సవాల్‌గా మారుతోంది.

● ప్రమాద జరిగే ప్రాంతాల్లో లేని సీసీ కెమెరాలు

కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న తుమ్మన్నపల్లి, సింగాపూర్, లింగాపూర్ క్రాస్‌రోడ్డులవద్ద తరుచూ రోడ్డుప్రవదాలు జరుగుతుంటాయి. రాత్రివేళల్లో లారీ డ్రైవర్లు వేగంగా వస్తున్న వేళ ద్విచక్రవాహనాదారులు ప్రాణాలను అరచేతిలో పెటుకొని నడుపుతున్నారు. ఈ సమయంలో అనుకొని ప్రమాదం జరిగితే తప్పు లారీడ్రైవర్‌దా లేక ద్విచక్రవాహనదారుడిదా అనేది తెలియడంలేదు. కారణం ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడమే. అలాగే పర్కాల్ క్రాస్‌రోడ్డు వద్ద, హుజూరాబాద్ నుంచి జమ్మికుంట పట్టణానికి వెళ్లేదారిలో రంగాపూర్ నుంచి మొదలు శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాల వరకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక పోవడంతో ప్రమాద ఘటనపై బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసునమోదు చేసినవేళ టెక్నికల్‌గా నిందితులను పట్టుకోవడం పోలీసులకు ఇబ్బందిగా మారుతోంది.

● రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది..
- బాషవేని రాజేష్‌యాదవ్, గ్రామస్థుడు,సింగాపూర్



కరీంనగర్-వరంగల్ రహదారి మా గ్రామం గుండా వెళ్తుంది. ఈ గ్రామంలో నెలలో మూడు, నాలుగు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో తప్పు ఎవరిదో అర్థం కావడంలేదు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలి.

● ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రత చర్యలు తీసుకోవాలి
-బింగి కరుణాకర్, మాజీసర్పంచ్, రంగాపూర్



ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు వెంటనే గుర్తించి, ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లను, రెడ్ స్టికర్స్‌లను ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగే ప్రాంతమంటూ హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేసి వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి.

స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్పోర్ట్స్ అకాడమీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖఅధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.2025-26విద్యాసంవత్సరానికి ప్రాంతీయక్రీడాహాస్టల్ హనుమకొండ, అథ్లెటిక్స్ అకాడమీఖమ్మం, సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీ, ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్, హాకీఅకాడమీ వనపర్తి, సరూర్‌నగర్, వాలీబాల్అకాడమీ రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

● **అకాడమీలు, ఎంపిక తేదీలు**

సిద్దిపేట వాలీబాల్అకాడమీలో ప్రవేశానికి జూన్1న సిద్దిపేటలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. సైక్లింగ్,రెజ్లింగ్ అకాడమీలకు ఉస్మానియాయూనివర్సిటీ క్యాంపస్ హైదరాబాద్‌లో జూన్10,11తేదీల్లో పోటీలు నిర్వహించనున్నారు. రీజనల్‌స్పోర్ట్స్ హాస్టల్ హనుమకొండలో ఎంపికపోటీలను జూన్ 10,11తేదీల్లో నిర్వహిస్తారు. వాలీబాల్ అకాడమీలు సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో ప్రవేశాలకు ఎంపికపోటీలను రాజన్నసిరిసిల్ల, వాలీబాల్ అకాడమీలో జూన్10వ తేదీన నిర్వహించనున్నారు. హాకీ అకాడమీ వనపర్తిలో ప్రవేశాలకు డీఎస్ఏ వనపర్తిలో జూన్ 12న, అథ్లెటిక్స్ అకాడమీ ఖమ్మంలో ప్రవేశాలకు డీఎస్ఏఖమ్మంలో జూన్ 12న ఎంపికపోటీలను నిర్వహించనున్నారు. వాలీబాల్ అకాడమీ మహబూబ్‌నగర్‌లో ప్రవేశాలకు డీఎస్ఏ మహబూబ్‌నగర్‌లో జూన్ 12,13తేదీల్లో నిర్వహిస్తారు.ఆసక్తిగల క్రీడాకారులు జననధ్రువీకరణపత్రం, సంబంధిత సర్టిఫికెట్‌లతో ఆయా తేదీల్లో సంబంధిత అకాడమీల్లో రిపోర్టు చేయాలని క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

రేపు ఉమ్మడి జిల్లా అండర్-17 చదరంగం ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాఅండర్-17 బాలబాలికల చదరంగం ఎంపికపోటీలను ఆదివారం జిల్లాకేంద్రంలోని రాంనగర్ విశ్వనాథ్ చెస్‌అకాడమీలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ అంతగిరిరాజేంద్రప్రసాద్ తెలిపారు. 2008జనవరి1తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అర్హత, ఆసక్తిగల క్రీడాకారులు శనివారం సాయంత్రం 5గంటల లోగా 9390177607నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్‌అండ్‌నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానాకన్) ఆధ్వర్యంలో డాక్టర్ రాష్ట్ర సదస్సును శనివారం నుంచి కరీంనగర్‌లోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తానాకాన్ ఆర్గనైజింగ్‌చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు500నుంచి800 మంది డాక్టర్లు ఈసదస్సుకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతఅధునాతన వైద్యవిధానం, చికిత్స తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరి 2025లో నిర్వహించిన డిగ్రీ, ప్రథమ, ద్వితీయ, తృతీయసెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదలచేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


దేవాలయంలో భక్తుల రద్దీ


సరస్వతి నది తీరాన భక్తులు







పుష్కర తీరం

పులకించిన భక్తజనం

● హాజరైన హంపి పీఠాధిపతి

● తొమ్మిదో రోజు 1.3 లక్షల మంది భక్తుల పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. భక్తులకు స్వామీజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో నదిలో పుణ్యస్నానం ఆచరించి ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభానందదేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

● **కన్నుల పండువగా హారతి**

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాశీ పండితుల ఆధ్వర్యంలో హారతిని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ పండితులకు స్థానిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాల ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టం అని అర్చకులు తెలిపారు.




భక్తుల పుణ్యస్నానాలు


రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడకు పోటెత్తుతున్న భక్తులు

● రోజురోజుకు పెరుగుతున్న తాకిడి

● 60వేల మంది వచ్చినట్లు అంచనా

వేములవాడ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు, రాజన్న ఆలయం జూన్ 15వ తేది వరకు మూసివేస్తారని ప్రచారం జరగడంతో భక్తులు తాకిడి రోజురోజుకు పెరుగుతోంది. శుక్రవారం రాజన్నను 60వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ఆవరణ రద్దీగా మారిపోయింది. ఉదయాన్నే భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు రాజన్న దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు తెలుస్తోంది.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రం లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హనుమాన్ భక్తులరద్దీ నెలకొంది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికితరలివచ్చారు. కొండగట్టు ఆంజనేయ స్వామిదర్శనం అనంతరం అనేకమంది హనుమాన్ దీక్షాపరులు క్షేత్రానికి వచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేక పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

జగిత్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 2,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 11.781 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 652క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 321 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మహిళా హోంగార్డును అభినందించిన ఎమ్మెల్యే

● నగదు ప్రోత్సాహకం అందజేత


ప్రోత్సాహకం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): మహిళా హోంగార్డును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం కరీంనగర్‌లోని క్యాంప్‌ఆఫీస్‌లో శుక్రవారం సత్కరించారు. కొండగట్టులో జరిగిన పెద్ద హనుమాన్ జయంతికి వచ్చిన చొప్పదండి మండలం కాట్నపల్లికి చెందిన వృద్ధురాలు బండారి శంకరమ్మ గురువారం అస్వస్థతకు గురై అయి పడిపోయింది. సమీపంలో విధులు నిర్వహిస్తున్న మహిళ హోంగార్డు కేసరి స్వరూప తన భుజాలపై మోసుకెళ్లి వైద్య శిబిరానికి తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహిళహోంగార్డును శాలువతో సత్కరించారు. ఆమె సమయస్ఫూర్తిని అభినందించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, దొంగ ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల విద్యార్థులు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు జగిత్యాల జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులను శనివారం మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గువ్వ శ్రీనివాస్, పాదం మహేందర్‌తోపాటు కవిగాయకుడు జలపతి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 100మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబర్చిన సుమారు 15మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లాక్రీడల అధికారి రవికుమార్, జిల్లాబాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, జాయింట్ సెక్రటరీ అరుణ్, సభ్యులు మహిపాల్, రాజు, రాజేందర్, పాదం తిరుపతి, కోచ్‌లు వంశీకృష్ణ, నవీన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు

మల్లాపూర్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి బోనాల పండుగను నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలోని అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కొత్త కుండలను అలంకరించి బోనాం తయారు చేశారు. భక్తులు బోనం నెత్తిన ఎత్తుకుని గ్రామంలోని పురవీధుల గుండా రాగా మహిళలు మంగళహారతులు, గంగపుత్రుల సంప్రదాయ వృత్తికి సంబంధించిన గొల్లెంవిన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. భక్తులు బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రోడ్డు రాజు, సంఘం సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లిలో బోనాలతో గంగమ్మతల్లి ఆలయంకు బయలు దేరిన భక్తులు

అంజన్నా.. వెళ్లొస్తాం..

● ముగిసిన హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ● నేటి నుంచి ఆర్జితసేవలు పునరుద్ధరణ


ఆలయ ఆవరణలో భక్తులు


కోనేరులో తొలగించిన నీరు


మెట్లపై బురద

మల్యాల, మే 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి వేడుక లు ఘనంగా ముగిశాయి. చివరిరోజు గురువారం అర్ధరాత్రి వరకు భక్తులతో కొండగట్టు కిక్కిరిసిపోగా శుక్రవారం కూడా రద్దీ నెలకొంది. వేలాదిగా హనుమాన్ భక్తులు దీక్షవిరమణ మండపంలో మాలవిరమణ చేసి అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులు జరిగిన జయంతికి లక్ష లాదిగా వచ్చిన భక్తులు వెళ్లొస్తాం.. అంజన్న- చల్లంగా చూడు.. అంటూ తిరిగి వెళ్లారు.

ఉత్సవాలు విజయవంతం..

జయంత్యుత్సవాలు విజయవంతంగా ముగియడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ దేవస్థానం తరుపున అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పర్యవేక్షణలో భక్తులకు సేవలు అందించిన పోలీస్, పంచాయితీరాజ్, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, వైద్య, అగ్నిమాపక, 108, రెవెన్యూ, దేవాదాయ, మిషన్ భగీరథ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను కొనియాడారు. అందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతం అయినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి వాహన పూజలు..

హనుమాన్ జయంతి సందర్భంగా నిలిపివేసిన అర్జిత సేవలను తిరిగి కొనసాగించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. శనివారం నుంచి వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు తదితర పూజలు యథావిధిగా ఉంటాయని భక్తులు గమనించాలని సూచించారు.

వందలాది సిబ్బంది ఉన్నా.. లోపించిన పారిశుధ్యం

హనుమాన్ జయంతి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు కొండగట్టుకు తరలిరాగ కొండపై అపరిశుభ్రత భక్తులను అసహానానికి గురిచేసింది. అడుగడుగున చెత్త దర్శనం ఇవ్వగా స్నానాలు చేయడానికి కోనేరుకు వెళ్లే మార్గం ద్వారం వద్దే బురదతో పాటు భక్తులు సమర్పించిన తలనీలాలు, చెత్తకుప్పలు ఉండడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. స్వామి వారి దర్శనం చేసుకొని వచ్చే వెనుక ద్వారం మెట్లన్నీ బ్లీచింగ్‌తో బురదగా మారి భక్తులు కొందరు జారిపడ్డారు. ఆలయంలోనూ భక్తులు వచ్చే మార్గంలో ముడుపుల బియ్యం కుప్పలుగా ఉండగా వాటిని వెంట వెంటనే తొలగించకపోవడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి. పారిశుధ్యం కోసం సుమారు నాలుగు వందలపైగా సిబ్బందిని నియమించినప్పటికీ అపరిశుభ్రతే దర్శనం ఇవ్వడంపై భక్తులు, దీక్షాపరులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.


ఆలయ ఆవరణలో భక్తులు చెల్లించుకున్న ముడుపులు

సెర్ప్ ఆధ్వర్యంలో 1.38 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కథలాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1.38 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని ఏపీఎం నరహరి తెలిపారు. మహిళా సంఘాలు పకడ్బందీగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేశాయన్నారు. అదేవిధంగా గంభీర్‌పూర్ సొసైటీ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 55 వేల క్వింటాళ్లు, భూషణరావుపేట సింగిల్ విండో పరిధిలో ఏర్పాటు చేసిన 12 కేంద్రాల్లో 1.60 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని చైర్మన్లు దాసరి గంగాధర్, లోక బాపురెడ్డి తెలిపారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రాయికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ మైనార్టీ, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 25న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి హాజరు కావాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఖాళీగా ఉన్న 8, 10, 17, 20, 21 వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మెట్‌పల్లి సీడీపీవోకు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీల్లో పలు సమస్యలపై చర్చించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పుల్లూరు వెంకటేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొల్కం శివ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు





కొడిమ్యాల, పెగడపల్లిలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు, మల్లాపూర్‌లో ఇంటర్వ్యూ కోసం వేచి ఉన్న దరఖాస్తుదారులు

కొడిమ్యాల, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలను ఎంపీడీవో స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటర్వ్యూలకు మైనార్టీ అభ్యర్థులు 47మంది, ఎస్టీ అభ్యర్థులు 49మంది, క్రిస్టియన్ అభ్యర్థులు ముగ్గురు, ఈబీసీ అభ్యర్థులు 43 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూలో మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్, యూనియన్ బ్యాంక్ కొడిమ్యాల శాఖ మేనెజర్ సంజీవ్‌కుమార్, మైనార్టీ కార్పొరేషన్ ప్రతినిధి, ఇండియన్ బ్యాంక్ పూడూర్ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్, కేడీసీసీ బ్యాంక్ కొడిమ్యాల బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఏపీఎం పద్మ, సూపరిండెంట్ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

పెగడపల్లి: రాజీవ్ యువ వికాసం రుణాల మంజూరుకు గాను పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్‌రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్న 651 మందికి గాను 380 మందిని ఇంట ర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు పరిశీలించగా కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, వివిధ బ్యాంకు శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి యూనిట్లను నెలకొల్పుకునేందుకుగాను అమలు చేయనున్న యువ వికాసం పథకానికి సంబంధించి ప్రారంభమైన ఇంటర్వ్యూలు రెండోరోజూ శుక్రవారం కొనసాగాయి. ఎంపీడీవో శంకర్‌నాయక్ సహా యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కేడీసీసీ బ్యాంకుల మేనేజర్లు బీసీ కేటగిరీకి చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డులను పరిశీలించి దరఖాస్తు చేసుకున్న యూనిట్లపై దరఖాస్తుదా రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మల్యాల: మండల కేంద్రంలో ఈబీసీ, మైనార్టీ, ఎస్టీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, అధికారులు నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ, క్రిస్టియన్‌లకు 228 మంది అభ్యర్థులకు గానూ 200 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఎంపీడీవో మహేశ్వర్ రెడ్డి తెలిపారు. 24న ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

గొల్లపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు శుక్రవారం అధికారులు, బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గొల్లపల్లి యూనియన్ బ్యాంక్ శాఖ దత్తత గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2700 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రోజు 400 మంది, రెండో రోజు 500 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో సామా రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో సురేష్ రెడ్డి, సూపరిండెంట్ రవీందర్ రావు, బ్యాంక్ మేనేజర్, అవినాష్, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది సౌజన్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొదటి రోజు ఈబీసీ అభ్యర్థులు 18 మంది, ముస్లిం మైనార్టీ అభ్యర్థులు 12 మంది, ఎస్టీ కార్పొరేషన్‌లో 72 మందికి మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఆరు బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, ఏపీఎం రాజయ్య, ఫీల్డ్ ఆఫీసర్ దత్తయ్య, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం షెడ్యూల్ కులాల వారికి రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండలంలో మొత్తం 670 మంది దరఖాస్తు చేసుకోగా 515 మంది ఇంట ర్వ్యూలకు హాజరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ బ్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తు దారులకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జిల్లా హార్టికల్చర్ అధికారి, మండల ప్రత్యేకధికారి శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటర్వ్యూలు నిర్వహించారు. బీసీ అభ్యర్థులు 350 మంది హాజరయ్యారు. అభ్యర్థులను ఎంపీడీవో లచ్చాలు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ధర్మపురి కేడీసీసీ బ్యాంక్, తుంగూర్ కేడీసీసీ బ్యాంక్ మేనేజర్లు, ఐకేపీ ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు శుక్రవారం మొదటి రోజు 207 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు. ఆయా బ్యాంకుల అధికారులు సమక్షంలో అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలోఅధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కల్తీ

(5వ పేజీ తరువాయి)

ఆన్ వీల్ వాహనం ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా హోటల్లు, దుకాణాల్లో సేకరించిన శాంపిళ్లను ఫుడ్ సేఫ్టీ వాహనంలో ఉన్న పరికరాల ద్వారా పరీక్షించి చర్యలు తీసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

- ఆహారంలో కల్తీ...ఇబ్బందులు

పాలల్లో చిక్కదనం కోసం నాసి రకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె, నీళ్లు కలిపి విక్రయిస్తున్నారన్న విమర్శలున్నాయి. జంతువు కళేబరాల నుంచి సేకరించిన ఎముకల బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి తీసిన ద్రావణాన్ని వంటనూనెలో కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యకరమైన జంతువు మాంసాన్ని 24 గంటలలోపే వినియోగించాలి. చాలా హోటళ్లలో చనిపోయిన జంతువుల మాంసాన్ని ఎక్కువకాలం నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నారు. చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికర రంగులు వాడుతున్నారు. నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెను మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీంతో క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్‌తో హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపునొప్పి, నిద్రలేమి, కిడ్నీ వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.

- నిబంధనలు ఏం చెబుతున్నాయి..

ఆహారానికి సంబంధించిన అన్ని వ్యాపారాలకు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ శాఖ సూచించే నియమ నిబంధనలను వ్యాపారులు తప్పకుండా పాటించాలి. అలా పాటించని వ్యాపారులపై కేసులు పెట్టాలి. ఆహారాన్ని శాంపిల్‌గా తీసి ల్యాబ్‌కు పంపించి, అందులో ఆహారం కల్తీ అయినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే అప్పుడప్పుడు మినహా కల్తీ వ్యాపారులపై పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

- అనూష, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, జగిత్యాల

హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ఇష్టారీతిగా వ్యవహరించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాము. ఎప్పటికప్పుడు దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, వసతి గృహాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాము. అనుమానం ఉన్న ఆహార పదార్థాల శాంపిల్స్ ల్యాబ్‌కు పంపుతున్నాము. కల్తీవని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాము.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



గొల్లపల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్

గొల్లపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తివిద్య నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్, జిల్లా విద్యాధికారి రాము నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా మూడోరోజు వృత్తి విద్యనైపుణ్య శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకుడితో కలిసి డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా వృత్తి విద్య నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునేం దుకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తివిద్య నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆరచరణలో మెరుగైనా ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలన్నారు. వృత్తి విద్య నైపుణ్యాన్ని పెంపొదించుకోవటానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో జమునా దేవి, సీఆర్‌పీలు రాజేందర్, ప్రభాకర్, లచ్చయ్య, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జగిత్యాల జిల్లా విద్యాధికారి రాము అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల)లో జరుగుతున్న ఐదు రోజుల ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణ తీసుకుంటూ నూతన పోకడలను అవలంబించాలని అన్నారు.

అనంతరం రాష్ట్ర పరిశీలకుడు దుర్గప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్‌లు సంతోష్, సతీష్, రమేష్, రాజేష్, రమేష్, మహేష్, పవన్‌కుమార్, నితిన్, సీఆర్‌పీలు సత్యనారాయణ, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వెల్గటూర్: ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా బోధనా నైపుణ్యాలు పెంపొందించుకొని విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల స్థాయిలో ఎస్జీటీలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణ శిబిరాన్ని జిల్లా విద్యాధికారి రాముతో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్, రమణ, డీఆర్పీ నీలం సంపత్‌కుమార్, వివిధ సబ్జెక్టుల రిసోర్స్‌పర్సన్లు గోసె సత్తయ్య, సాగర్, మహేష్, రమేష్, శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్, కల్పన, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

మల్యాల: విద్యార్థులను తీర్చిదిద్దడం, వారి ఉన్నతిలో ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర అని ప్రముఖ వ్యక్తిత్వ నిపుణుడు పడాల తిరుపతి అన్నారు. మల్యాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం, బడిబాట కార్యక్రమం విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ జయసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈద్గాలో వసతులు కల్పించాలి

కోరుట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పురస్కరించుకొని పట్టణ శివారులోని ఈద్గాలో వసతులు కల్పించాలని కోరుతూ కోరుట్ల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు ఎంఐఎం నాయకులు శుక్రవారం వినతి పత్రంను అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఈద్గాలో మౌలిక వసతులు కల్పించి నమాజుకు వచ్చే ముస్లింలకు ఇబ్బందులు తొలగించాలని తెలిపారు. ఎంఐఎం నాయకులు రఫీ, అబ్బుల్ వాజిద్, రౌఫ్, రహీం, సమీర్, సురేష్, ముజాహిద్, ఖలీం, మున్నా, ఫయాజ్, మోహన్‌బాబు, లియాకత్, నహీం తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో మాజీ మంత్రి పూజలు

రాయికల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని గంగమ్మ ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మహేందర్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, హన్మాండ్లు, రాజిరెడ్డి, మహేష్, నర్సయ్య, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి ఉపాధ్యాయుల సంఘీభావం



సారంగాపూర్‌లో జాతీయ జెండాలతో ఉపాధ్యాయులు

సారంగాపూర్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధ్యాయులు భారత సైన్యానికి సంఘీభావంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన దాడులకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి భారత సైన్యం సత్తా ఏంటో చూపించారని ఉపాధ్యాయులు కొనియాడారు. ఎంఈవో బి కిషోర్, మండలానికి చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌టీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థ

జగిత్యాల సర్కిల్ ఎస్ఈ సాలియా నాయక్

జగిత్యాల అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హెచ్‌టీ 11కేవి, 33కేవి ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్‌విండో వ్యవస్థను ప్రవేశపెట్టామని జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ సాలియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టీ 11, 33కేవీ ఆపై వోల్టేజీ సర్వీసుల మంజూరు సరళీకృతం చేయడానికి హెచ్‌టి మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీస్, కార్పోరేట్ ఆఫీసులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 11కేవీ వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్‌లో ఏడీఈ కమర్షియల్ అధికారి మానిటర్ చేస్తారని, 33కేవీ వోల్టేజీ, ఆపై వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీస్ ఏడీఈ కమర్షియల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా మొదట వినియోగదారులు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు(టీజీ ఐపాస్‌లో నమోదు కానటువంటివి) నమోదు చేసుకున్న తర్వాత కొత్త అప్లికేషన్ నంబర్ యూఐడీ వస్తుందన్నారు. అలా వచ్చిన కొత్త దరఖాస్తులను టీజీఎన్‌పీడీసీఎల్ యొక్క సంబంధిత సర్కిల్‌లో డాష్‌బోర్డు లో కనిపిస్తుందన్నారు. ప్రతీరోజూ ఏడీఈ, కమర్షియల్ అధికారులు డాష్‌బోర్డును మానిటర్ చేస్తుంటారన్నారు. దరఖాస్తు నమోదు చేసుకున్న తర్వాత 11కేవీ, 33కేవీ ఆపై వోల్టేజీ దరఖాస్తులు సంబంధిత అధికారులకు ఎస్టిమేట్ల కోసం పంపిస్తామన్నారు. 33కేవీ, ఆపై వోల్టేజీ ఎస్టిమేట్లు కార్పోరేటు ఆఫీసులో అధికారులు అనుమతిస్తారన్నారు. 11కేవీ వోల్టేజీ దరఖాస్తులను పరిశీలించి రెండు రోజుల్లో అప్‌లోడ్ చేయబడుతుందన్నారు. వివిధ కారణాల వల్ల సాధ్యపడకపోతే రెండు రోజుల్లోపు రిమార్క్‌లు వినియోగదారులకు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుందన్నారు. సింగిల్ విండో వ్యవస్థ వల్ల త్వరగా సర్వీసులు మంజూరు అవుతాయన్నారు. ప్రతీసారి ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ట్రాక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. దీనివల్ల అత్యంత పారదర్శకత పెరుగుతుందని వినియోగదారులు దరఖాస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ రూపేణా సమాచారం పంపబడుతుందని వివరించారు.

మృతుల కుటుంబసభ్యులకు పరామర్శ

ధర్మపురి, మే 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన నందగిరి రత్నమాల, ఒడ్నాల భూమేశ్వర్ అనే వ్యక్తులు ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. రత్నమాల అనారోగ్యంతో మృతి చెందగా ఒడ్నాల భూమేశ్వర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబసభ్యులతో మాజీ మంత్రి మాట్లాడి మృతి వివరాలు తెలుసుకుని ఓదార్చారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మాజీ వైస్‌చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, మాజీ కౌన్సిలర్ సయ్యద్ యూనస్, సంగి శేఖర్, పురాణపు సాంబమూర్తి, గుర్రాల సుధాకర్, సంగి శ్రీనివాస్, గడ్డం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. తడిసిన ధాన్యం

గొల్లపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం తెల్లవారు జామున వాన దంచికొట్టింది. భారీ వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయం కాగా, గ్రామాల్లోని మురికి కాలువలు వర్షపు నీటితో పొంగి పొర్లాయి. భారీ వర్షం ధాటికి పలు గ్రామాల్లో విక్రయానికి పోసిన వరి ధాన్యం తడిసిముద్దయింది. వెంగళాపూర్ గ్రామంలో విక్రయానికి పోసిన ధాన్యం రాశులు వర్షపు నీటిలో పాక్షికంగా మునిగిపోయాయి. పలు కేంద్రాల్లో మిల్లులకు తరలించేందుకు లారీల్లో లోడింగ్ చేసిన వరి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. దీంతో రైతులు ఆందోళనలో మునిగిపోయారు. మండలంలోని చిల్వాకోడూర్, లొత్తునూర్ గ్రామాల్లో చెందోళి సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిముద్దయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి బలి అవుతున్నామంటూ రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పలు గ్రామాల్లో నూర్పిడి చేయడానికి సిద్ధంగా ఉంచిన నువ్వు పంట వర్షం ధాటికి తడిసి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఇస్రాజ్‌పల్లె, రాపల్లె తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ధాటికి శ్రీరాములపల్లె, గొల్లపల్లి, బీబీరాజ్ పల్లె, రాఘవ పట్నం, శంకర్రావు పేట, మల్లన్న పేట, వెంగళాపూర్, వెన్గుమట్ల, గంగాదేవి పల్లె గ్రామాల్లో చేతికంది వచ్చిన మామిడి పంట నేలరాలింది. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర



వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, మే, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపేట గ్రామంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి పంచమృతాలతో అభిషేకాలు, అర్చనలు, తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా పురోహితులు ఆశీర్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌యాదవ్, గోపిడి పెద్దఅంజిరెడ్డి, మారు శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర మారుతి, అనంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

26నుంచి బీసీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

పెగడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు 26, 27 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం అయిత్‌పల్లి, ఆరవెల్లి, బతికెపల్లి, దీకొండ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి దో మలకుట, ఏడుమోటలపల్లి, కీచులాటపల్లి, లింగాపూర్, ల్యాగలమర్రి, మద్దులపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల లబ్ధిదారులు హాజరుకావాలని సూచించారు. 27న ఉదయం 10 గంటలకు నామాపూర్, నంచర్ల, నందగిరి, నార్సింహానిపేట, పెగడపల్లి, రాజారాంపల్లి గ్రామాల లబ్ధిదారులు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రామబద్రునిపల్లి, రాములపల్లి, శాలపల్లి, సుద్దపల్లి, వెంగళాయిపేట, ఎల్లాపూర్ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

అలయన్ క్లబ్ సేవలను విస్తరింపచేయాలి

కోరుట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): అలయన్ క్లబ్ సేవలు మరింత విస్తరింపచేయాలని క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రాజుకుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలో జిల్లా కార్యవర్గానికి క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం రాజుకుమార్. జిల్లా గవర్నర్‌గా బండ్ల గజానంద్, వైస్ గవర్నర్లుగా కటకం రాజశేఖర్, అవధూత రజనీకాంత్, కార్యదర్శిగా కొక్కుల శంకర్, కోశాధికారిగా కటకం సురేఖ, పీఆర్‌వోగా బండ్ల మురళి ప్రమాణ స్వీకారం చేశారు.

నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలులో జాప్యమా?

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): నెలల గడుస్తున్నా కొనుగోలులో జాప్యం ఎందుకని, ఇలా అయితే రైతుల పరిస్థితి ఏమిటని ఐకేపీ నిర్వాహకులపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం వివరాల ఆన్‌లైన్ నమోదు రికార్డును పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో నెలల తరపడి జాప్యం చేయడం ఎందుకని, జిల్లా అధికారులు స్పందించి కొనుగోలును వేగవంతం చేయాలని సూచించారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో రైతులు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- పూజలో పాల్గొన్న ప్రభుత్వం విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం ధ్వజస్థంభ ప్రతష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో వాస్తు, స్థాపిత దేవతా పూజలను నిర్వహించి ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య ధ్వజస్థంభ అవరోహణను గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీరామనామ స్మరణతో దేవాలయం మార్మోగింది. అంజనేయ స్వామి అష్టోత్తరం, చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. ఆలయానికి వేర్వేరుగా విచ్చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించిన వారికి దేవాలయ జ్ఞాపికను అందించారు.

అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, సుజిత్‌రావు, తిరుమల గంగాధర్, బొల్లముల్ల నర్సయ్య, కొంతం రాజం, సత్యనారాయణ, గౌడ్, నరేష్, బీఆర్ఎస్ నాయకులు దారిశెట్టి రాజేష్, చీటి వెంకటరావు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.




పత్యేక పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్